మార్గదర్శకులు సీతారాం ఏచూరి

- సిపిఎం అగ్రనేతకు ఘన నివాళి
- ఏచూరికి గొప్ప అభిమానిని- కూనంనేని
- ఆదర్శ కమ్యూనిస్టు నేత ఏచూరి - కెటిఆర్
- ఏచూరి ఆశయాలను కొనసాగించాలి మోహన్ కందా

నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీతారాం ఏచూరికి తాను తెలియకుండానే గొప్ప అభిమానిగా మారిపోయానంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉదయరేఖలు ప్రసరింపజేస్తోనే ఆయన అస్తమించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం కమ్యూనిస్టులకే కాకుండా దేశ రాజకీయ రంగాన్ని కుదిపిందని తెలిపారు. జెఎన్‌యుకు మూడు సార్లు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గొప్ప విషయమని తెలిపారు. సీతారాం ఏచూరికి వచ్చిన ఆదరణ, ప్రజలు కమ్యూనిజాన్ని కోరుకుంటున్నారనే విషయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. ఆయన ప్రతి పలుకు బంగారమేనన్నారు. ఆయన మాట్లాడే ఒక్కో పదం దేశ పరిస్థితులను సమ్మిళితం చేసే ఆర్ద్రత ఉంటుందన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, వామపక్ష పార్టీల నేతలు, టిజెఎస్ అధ్యక్షులు కోదండరాం, మాజీ సిఎస్ మోహన్‌కందా, తదితరులు హాజరయ్యారు. కూనంనేని మాట్లాడుతూ, ఏచూరి తెలుగు రాదంటూనే చక్కగా మాట్లాడుతారని తెలిపారు. దేశంలో ప్రతి కమ్యూనిస్టు తన సొంత నాయకుణ్ణి కోల్పోయినట్టు భావిస్తున్నారని చెప్పారు. ప్రశ్నించే వాళ్ళు ఉన్నారంటూ ఒక సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారనీ, అది కమ్యూనిస్టులనుద్దేశించి అన్నారని తాను భావిస్తున్నట్టు తెలిపారు.'ప్రశ్న సజీవంగా ఉండాలి. కమ్యునిజం సజీవంగా దేశానికి దిక్సూచిగా ఉండాలి. ఎర్ర జెండాలన్నీ ఒకటి కావాలి' అని ఆకాంక్షించారు. ఏచూరికి సిపిఐ తరుపున ఘన నివాళి అర్పిస్తున్నట్టు ప్రకటించారు.

ఉద్యమాల బిడ్డలతో మాది రక్తసంబంధమే - కెటిఆర్

ప్రజా ఉద్యమాల బిడ్డలతో మా బంధం రక్త సంబంధమేనని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ తెలిపారు. ఆ భావన మాలో బలంగా ఉంటుందని చెప్పారు. 'బతికున్నంత వరకు ప్రజల కోసమే బతకడం కాదు. చనిపోయాక కూడా తన దేహాన్ని ప్రజలకు ఉపయోగపడాలనే ఏచూరి ఆశయం చాలా గొప్పది' అన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డప్పుడు మౌనం అనేది చాలా ప్రమాదకరమని ఏచూరి అన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రశ్నించే గొంతుకలకు అండగా నిలబడుదామని కోరారు. పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయాల్లో స్థిరంగా, సిద్ధాంతం కోసం నిలబడ్డ నాయకుడు ఏచూరి గుర్తు చేశారు. ఎప్పుడు ఏ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శ నేత ఏచూరి మాత్రమే అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రాజకీయం కోసం అపహాస్యం చేస్తున్న ఈ రోజుల్లో రాజ్యాంగాన్ని త్రికరణ శుద్ధితో నమ్మిన వ్యక్తి అనీ, ప్రశ్నించడమే ప్రజాస్వామ్యం అని గుండెల నిండా నమ్మిన వ్యక్తి అని కొనియాడారు.

ఏచూరి ఆశయాలను కొనసాగించాలి - మోహన్ కందా

'మన కంటే చిన్న వాళ్ల మన కండ్ల ముందు చనిపోతే అది బాధాకరం. ఆయన మన మధ్యన లేకపోయినా ఆయన ఆశయాలను కొనసాగించాలని ఏచూరి మేనమామ, మాజీ సిఎస్ మోహన్ కందా అన్నారు. చిన్నతనం నుంచి ఏచూరితో ఆయనకున్న అనుబంధాన్ని వివరించారు. ఎమర్జెన్సీ సమయంలో కర్నూలులో ఉన్న నా దగ్గరికి సీతారాం వచ్చాడు. ఆయన్ని మార్చాలని నేను తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యా. ఇంకొన్ని రోజులు నా దగ్గరే ఉంటే మేము మారిపోయేవాళ్లం అని కందా తెలిపారు. సీతారాం లేకపోయినా ఆయన ఆశయాలను కొనసాగించాలి'అని అన్నారు.

టిజెఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలకు పాతరేయబడుతున్న నేటి పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేకపోవటం లోటుగా ఉందని చెప్పారు. దేశ రాజకీయాల్లో ఆయన పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాల బాటపట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వెయిటేజ్ మార్కుల కోసం ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించారని గుర్తు చేశారు. వైవిధ్యం కలిగిన దేశంలో భారతీయ పౌరులుగా కలిసుందాం అంటూ పార్లమెంట్‌లో ఆయన చేసిన ఉపన్యాసం దేశానికే మంచి మెసేజ్ ఇచ్చిందన్నారు.

సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి రంగారావు మాట్లాడుతూ.. పదవుల కోసం పార్టీలు మారుతున్న సమయంలో,చొక్కాలు మార్చినట్టు జెండాలు మారుస్తున్న స్థితిలో విలువలు మటుమాయమవుతున్న కాలంలో తాను నమ్మిన సిద్ధాంత కోసం నిబద్ధతతో నిలబడ్డ నాయకుడు సీతారాం ఏచూరి అని చెప్పారు. మతోన్మాదానికి , ఫాసిస్టు చట్టాలకు వ్యతిరేకంగా అందరినీ కూడగట్టటంలో ఆయన కృషి మరవలేనిదన్నారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. శ్రామిక వర్గ సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు నిలబడ్డ గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని చెప్పారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. అనేక కారణాల రీత్యా వామపక్ష ఉద్యమం బలహీనపడుతున్నదనీ, మరో పక్క ఫాసిస్టు శక్తుల బలం పెరగుతున్నదన్నారు. ఇలాంటి సమయంలో వామపక్షాల ఐక్యత మరింత అవసరమన్నారు. వామపక్ష శక్తుల ఐక్యకార్యాచరణ కొనసాగించాలన్నారు.

ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక పోరాటాలను జమిలీగా నిర్వహించాల్సిన అవసరాన్ని ఏచూరి గతంలోనే చెప్పారని గుర్తుచేశారు. రోహిత్ వేముల విషయంలో ఆయన చూపిన చొరవ మరవలేనిదని చెప్పారు. ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ జాతీయ రాజకీయాల్లో ఏచూరి చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న మాట్లాడుతూ సీతారం ఏచూరి జీవితమంతా ప్రజలకే అంకితం చేశారన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి రమేష్ రాజా మాట్లాడుతూ.. అంతర్జాతీయ రాజకీయాలను అలవోకగా శాస్త్రీయంగా విశ్లేషించటం ఆయనకే సాధ్యమన్నారు.. ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి మాట్లాడుతూ ఏచూరికి నివాళు లర్పించటమంటే..ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవటమేనని చెప్పారు. పార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి తేజ్‌దీప్‌రెడ్డి మాట్లాడుతూ... యువతరానికి స్ఫూర్తినిచ్చిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి అని చెప్పారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా ఆయన గురించి చెప్పుకుంటారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలను చట్టసభల్లో లేవనెత్తటంలో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు

- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐ, ఎటిసిలు, పాలిటెక్నిక్ కాలేజీలు
- ముఖ్యమంత్రి రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఐటీఐల్లో కోర్సులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు ఓ కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తల సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆయన సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపళ్లు ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. వాటిలో శిక్షణ తీసుకుంటున్న వారికి ట్రైనింగ్ సమగ్రంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా ఆయా కళాశాలలను పర్యవేక్షించి, తనిఖీలు చేపట్టాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఎటిసి (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్)లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ఐటిఐ/ ఎటిసి లేని శాసనసభ నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా మిగతా వంద నియోజకవర్గాల్లో ఐటిఐ/ ఎటిసిలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. వృత్తి నైపుణ్యాలను అందించే ఐటీఐ/ఎటిసి, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధి విధానాలు రూపొందించాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టిజిఐఐసి ఎండి విష్ణువర్దన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టిటిడికి పాల ఉత్పత్తులు అందించేందుకు విజయ డెయిరీ సిద్ధం

- లేఖ రాసిన సబ్యసాచి ఘోష్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నైవేద్యాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేసేందుకు విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని తెలంగాణ పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు.ఈమేరకు శనివారం టిటిడి కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. దేశ వ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ సంస్థ ప్రసిద్ధి చెందిందని గుర్తు చేశారు. వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేసిన చరిత్రను కలిగి ఉందని పేర్కొన్నారు. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యతను పాటిస్తున్నదని చెప్పారు. తద్వారా లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. దేవస్థానానికి, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

మరో మూడు రోజులు వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 'పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న నైరుతిలో ఎగువ గాలులలో ఆవర్తనం కొనసాగుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో, తూర్పు, పశ్చిమ గాలి విచ్చిన్నతిలో కేంద్రీకృతమై, మధ్య ట్రోపోస్పిరిక్ స్థాయి వరకు విస్తరించింది. దీని ప్రభావం వల్ల సెప్టెంబర్ 23న వాయువ్య, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది' అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దీని ప్రభావం వల్ల ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, ఆసిఫాబాద్, వికారాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. సోమవారం.. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మహబూబాబాద్, సూర్యాపేట, కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

హైదరాబాద్‌లో భారీ వర్షం

హైదరాబాద్: హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సికింద్రాబాద్, తార్నాక, నాచారం, ఉప్పల్, రామంతాపూర్, మేడిపల్లి, కోఠి, చిక్కడపల్లి, ముషీరాబాద్, ఎల్‌బినగర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఐటీ కారిడార్‌తోపాటు సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్‌బినగర్ తదితర ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. అత్యధికంగా ఖైరతాబాద్‌లో ఎనిమిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోల్కొండలో 7.3, ఆసిఫ్‌నగర్‌లో 7.1, మెహదీపట్నంలో 6.4, సికింద్రాబాద్‌లో 5.8, నాంపల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 5 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిహెచ్‌ఎంసి

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైన పని ఉంటేనే బయటకు రావాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి నగరవాసులను కోరారు. బలమైన గాలులు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నందున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్‌ఎంసీ క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో సిబ్బంది, డిఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, చెరువులు, కుంటలు, నాలాల వద్ద ఉండొద్దని కమిషనర్ సూచించారు.

డిఎఒ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డిఎఒ) గ్రేడ్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించామనీ, నిపుణుల కమిటీ సిఫారసుల ఆధారంగా తుది కీని ప్రకటించామని పేర్కొన్నారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేశామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. ఆ వివరాలు www. tspsc. gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. 53 డీఏఓ పోస్టుల భర్తీకి 2022, ఆగస్టు నాలుగో తేదీన టిజిపిఎస్‌సి నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి

- రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో పలు సంఘాలు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుంటామని చెప్పారు.ఈ క్రమంలోనే ఈనెల 29న తహశీల్దార్లు, అక్టోబరు 6న డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో భేటీ కానున్నట్టు తెలిపారు. ఉద్యోగులు సైతం సర్కార్ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని వారికి పలు సూచనలు చేశారు. "మీ పని తీరు మరింత మెరుగు పడాలి. గతంలో పని చేసిన విధానం వేరు, ఇప్పుడు వేరు. నిజాయితీ, నిబద్ధతతో పారదర్శకంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. మాది ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఎవరిమీద వ్యక్తిగత కోపాలు లేవు. మా తపనంతా పేద ప్రజానీకానికి మేలు చేయాలన్నదే. రాబోయే రోజుల్లో రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపించాలి. ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కావొద్దు. వాటిని కాపాడే విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలి. ఈ విషయంలో సరైన సూచనలు, సలహాలివ్వడానికి సచివాలయంలోని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండేలా వ్యవస్థను పునరుద్ధరిస్తాం" అని మంత్రి వారికి వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. చంద్రమోహన్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

జీవవైవిధ్య పరిరక్షణ యువత బాధ్యత

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అనూహ్య వాతావరణ మార్పుల నేపథ్యంలో భూగోళం, పర్యావరణం, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరులోని కన్హా శాంతి వనంలో రెండోరోజు జరుగుతున్నరైజింగ్ విత్ కైండ్‌నెస్'జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయెద్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ డిప్యూటీ చైర్మన్ డాక్టర్ హమ్దాన్ అల్‌షార్, ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ప్రతినిధి మార్టిన్ రైజర్, హరి క్రిష్ణా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సిఇఒ బ్రిజేష్ ధోలాకియా తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు. ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణ వాతావరణం పెరుగుతున్న క్రమంలో ప్రేమ, కరుణ, ఆధ్యాత్మిక చింతన మానవాళికి దశ దిశ చూపుతుందన్నారు. శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో కన్హా శాంతి వనం అద్భుతంగా పని చేస్తుందని, ప్రభుత్వం తరపున అవసరమైన మద్దతు ఇస్తామని భరోసానిచ్చారు.

మార్పునకు మహిళలు ప్రధాన పాత్రధారులు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు మార్పునకు ప్రధాన పాత్రధారులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం హైదరాబాద్ ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో "ఆల్ ఇండియా ఉమెన్ అకాడెమిషన్స్ కాన్ఫరెన్స్" "ఎన్విజనింగ్ న్యూ భారత్" అనే థీమ్‌తో, అఖిల్ భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసర్చ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మద్దతు ఇవ్వడానికి ఫెమినిస్ట్ దృక్పథాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదని, ఇది భారతీయ సంస్కృతిక విలువలకు అనుగుణంగా ఉంటుందని అన్నారు. కొత్తదనాన్ని వెతకడం కంటే సంప్రదాయ ఆలోచనలను పునర్నిర్మించడం, పునరుద్ధరించడం అవసరమని తెలిపారు.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ.. మహిళలు సమాజానికి విలువలను అందించడంలో కీలక పాత్ర పోషించారనే విషయాన్ని గుర్తు చేశారు. మహిళలు ప్రశ్నించాలని, వారికి మార్గనిర్దేశం చేయడం తప్ప, నియంత్రించకూడదని తెలిపారు. సవాళ్లను ఎదుర్కొనడం, కఠిన పరిస్థితులను అధిగమించడం, విద్యార్థులకు విలువలు నేర్పించడం ముఖ్యమని చెప్పారు. ఇతరులతో కాకుండా మనతో మనం పోటీపడటమే మక్కువగా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు మార్పును తీసుకురావడానికి తమ శక్తిని ఉపయోగించాలని సూచించారు. ఎబిఆర్ఎస్ఎం నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళా విద్యావేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు పరస్పరం ఆలోచనలు పంచుకోవడం, ఒకరిని ఒకరు ప్రోత్సహించుకోవడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐసిఎస్ఎస్ఆర్, ఎస్‌టిసి డైరెక్టర్ డా.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సదస్సు మహిళా ఉపాధ్యాయులను శక్తివంతం చేయడంలో కీలకంగా ఉందని ప్రశంసించారు. దేశ వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సహకారం, మద్దతు, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ఈ ప్రయత్నం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. జెఎన్‌యూ వీసీ ప్రొ.శాంతిశ్రీ పండిట్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో మహిళా నాయకత్వం కీలకమని, పురుషుల కంటే సమావేశ మందిరంలో ఎక్కువ మంది మహిళలు ఉండటం అందుకు సంకేతమని అన్నారు. మహిళలు మరింతగా నాయకత్వ భూమికలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి.. మహిళలను రక్షించడంలో, శక్తివంతం చేయడంలో కమిషన్ పాత్రను చర్చించారు. సవాళ్లను అధిగమించడంతో పాటు, హక్కులు కోల్పోయిన వ్యక్తులందరికీ న్యాయం అందించడంలో కమిషన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అదనంగా, వివిధ శాఖలు మరియు రంగాల్లో సహకారం పెంపొందించడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ మహిళల కోసం అనేక శిక్షణా కార్యక్రమాలు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించినట్టు తెలిపారు. మహిళా సాధికారత అవసరాన్ని ప్రస్తావించి, పురుషుల దృక్పథంలో మార్పు అవసరమని ఐఎఎస్ అధికారి దేవసేన సూచించారు. మహిళల దుస్తులపై వ్యాఖ్యలు చేయడం ఆపి, ఇంటిలో, పని ప్రదేశంలో వారికి మరింత స్వేచ్ఛను ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కిషన్, ప్రొఫెసర్ కవిత దేవి తదితరులు పాల్గొన్నారు.

28న రాష్ట్రానికి రాష్ట్రపతి

- ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈ నెల 28న రాష్ట్రానికి రానున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆమె శనివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పతి తన ఒకరోజు పర్యటన సందర్భంగా, ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలిపారు. సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్రమంలో శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలనీ, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలనీ, ఆ నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్‌ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు సూచించారు. డీజీపీ జితేందర్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీ ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ సిఎండి టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్ ఇతర ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లు

పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కండ్లలాంటివని ప్రజాపద్దుల సంఘం చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. పిఎసి కమిటీ ఏర్పాటై వందేండ్లు పూర్తవుతున్న తరుణంలో తమను చైర్మన్‌గా నియమించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తన బాధ్యతను నిబంధనల ప్రకారం నిర్వహిస్తానని తెలిపారు. శనివారం హైదరాబాద్ అసెంబ్లీ కమిటీ హాల్‌లోగాంధీ అధ్యక్షతన పిఎసి సమావేశం జరిగింది. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు తదితర అంశాలపై మొదటి సమావేశాన్ని నిర్వహించారు. పిఎసి చైర్మన్‌గా గాంధీని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, పిఎసి సభ్యులు హాజరయ్యారు. చైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించడంపై శ్రీధర్‌బాబును నిలదీశారు. ఎంపిక అప్రజాస్వామికంగా జరిగిందన్నారు.



GOWRA LEASING & FINANCE LIMITED

GOWRA GROUP

CIN : L65910TG1993PLC015349
Regd Office : 501, 5th Floor, Gowra Grand, Behind Gowra Plaza, #1-8-384 & 385, S.P.Road, Begumpet, Secunderabad - 500003.
Ph :040-27843086, E-mail : info@gowraleasing.com, Website: www.gowraleasing.com

శనివారం, 28 సెప్టెంబర్, 2024న జరగాల్సిన వార్షిక సర్వసభ్య సమావేశం ప్రకటనకు సవరణ

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా ఏజిఎం నిర్వహణ నోటీసులో పేర్కొన్న వ్యాపార లావాదేవీలకు వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి)/ఇతర ఆడియో-విజువల్ మీన్స్ (ఓఏవిఎం) ద్వారా గౌరాలీసింగ్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ సభ్యుల వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) శనివారం, 28 సెప్టెంబర్, 2024 సా.4:00 గంటలకు నిర్వహించబడును. తాజాగా సవరించబడినట్లుగా సవరించిన కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్ 2014లోని రూల్ 18తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 101ను అనుసరించి, కంపెనీ/ రిజిస్ట్రార్ & షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఏ)/ డిపాజిటరీ పార్టిసిపెంట్(ల)తో రిజిస్టరైన మీ ఇమెయిల్ అడ్రస్‌లకు ఏజిఎం యొక్క నోటీసు ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా 6 సెప్టెంబర్, 2024న పంపబడినది. నోటీసు యొక్క వివరణాత్మక స్టేట్‌మెంట్‌లోని ఐటెమ్ నెం.5లోని సబ్ పాయింట్ సబ్ పాయింట్ 4 & 5లో కింది జోడింపు గురించి కంపెనీ షేర్‌హోల్డర్‌లు/ బెనిఫిషియల్ ఓనర్స్‌కు తెలియజేయడానికి సవరణ జారీ చేయబడుతోంది. సెబీ (క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2018లోని రెగ్యులేషన్ 166ఏ ప్రకారం, రిజిస్టర్డ్ వాల్యూయర్ నుండి పొందిన వాల్యుయేషన్ నివేదిక కంపెనీ వెబ్‌సైట్:https://www.gowraleasing.com/లో ప్రచురించబడింది. కంపెనీ వెబ్‌సైట్‌లో వాల్యుయేషన్ రిపోర్ట్ లింక్: https:// www.gowraleasing.com /pdf/new/Equity%20Valuation%20Report.pdf ఈ సవరణను ఏజిఎం నోటీసుకు కొనసాగింపుగా మరియు దానితో కలిపి చదవాలి. పైన పేర్కొన్నవి మినహా, 31 ఆగస్టు, 2024 నాటి ఏజిఎం నోటీసులోని అన్ని ఇతర నిబంధనలు మరియు విషయాలలో మార్పులేవు. నోటీసుకు సంబంధించిన సవరణ కంపెనీ వెబ్‌సైట్ అనగా www.gowraleasing.com, స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా బిఎస్ లిమిటెడ్ bseindia.com లో మరియు కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (కెఫిన్‌టెక్) వెబ్‌సైట్: https://evoting.kfintech.com నందు కూడా ఉంచబడుతోంది.

For GOWRA LEASING & FINANCE LIMITED,
Sd/-
(GOWRA SRINIVAS)
Managing Director
(DIN: 00286986)

Place : Secunderabad
Dated : 21-09-2024

కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

- బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందని బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. బాపూజీ తెలంగాణ సాధించటానికి, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. గాంధేయవాదిగా విలువలకు కట్టుబడి, ఎన్నో పోరాటాలు నడిపారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి దశ, మలిదశ పోరాటంలో ఆయన స్ఫూర్తితో పనిచేశామని గుర్తు చేశారు. కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉండి కూడా ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఎలాంటి పదవులను ఆశించకుండా తెలంగాణ గురించి, వెనుకబడిన వర్గాల గురించి పోరాడారని పేర్కొన్నారు.

దక్షిణ డిస్కంలో రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో రికార్డు స్థాయిలో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదయ్యింది. శుక్రవారం ఉదయం 10 గంటల 35 నిమిషాలకు 9,910 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయినట్టు సిఎండి ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో భారీగా వర్షాలు పడటం, నీటి లభ్యత పెరగడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వ్యవసాయ రంగంలో డిమాండ్ భారీగా పెరిగిందని వివరించారు. ఈ సీజన్‌లో అత్యధిక డిమాండ్ 10వేల మెగావాట్లను దాటే అవకాశం వున్నట్టు అంచనా వేశామన్నారు. గతేడాది ఇదే రోజున, అదే సమయంలో డిస్కం పరిధిలో 9,862 మెగావాట్లు నమోదయ్యిందని తెలిపారు.

93 ఏళ్ల కేన్సర్ బాధితుడికి ఎఒఐ కొత్త జీవితం

ప్రజాశక్తి - హైదరాబాద్

అడ్వాన్స్‌డ్ కోలన్ కేన్సర్‌తో బాధపడుతున్న 93 ఏళ్ల వృద్ధునికి కొత్త జీవితాన్ని అందించినట్లు సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎఒఐ) తెలిపింది. అధునాతన కేన్సర్ చికిత్స, తక్కువ కోత శస్త్ర చికిత్స పద్ధతిలో వైద్యం అందించినట్లు పేర్కొంది. దీనిలో భాగంగా బాధితుడి పెద్దప్రేగు కుడి వైపు భాగాన్ని కొంత తీసివేసి, పేగులోని మిగిలిన భాగాలను తిరిగి కనెక్ట్ చేసినట్లు హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. శస్త్ర చికిత్స చేసిన అనంతరం ఐదవ రోజున బాధితుడు స్థిరంగా కోలుకున్నారని భావించిన తర్వాత డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించాయి.

26 నుంచి ఔషధ ఉత్పత్తుల ఎక్స్‌పో

హైదరాబాద్ : సెప్టెంబర్ 26-28 తేదీల్లో హైదరాబాద్‌లో ఔషధ ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మా ప్రో అండ్ ప్యాక్ ఎక్స్‌పో సంస్థలు తెలిపాయి. హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనలో 14 దేశాల నుంచి 500 పైగా ఎగ్జిబిటర్లు 7,000 పైగా వినూత్న ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచనున్నారని మెస్సే మున్‌చెన్ ఇండియా సిఇఒ భూపిందర్ సింగ్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఫార్మా ఎక్స్‌పోను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మూసీ బాధిత కుటుంబాలకు న్యాయం

- డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయాలని నిర్ణయించాం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- చంచల్‌గూడ, వనస్థలిపురంలో డబుల్ బెడ్‌రూమ్‌ల పరిశీలన

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ ఆధునీకరణలో భాగంగా చేపడుతున్న పనుల వల్ల నష్టం జరిగే కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని, ఈ విషయంలో ఎవరూ ఎలాంటి ఆందోళనా చెందొద్దని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకొనిపోవడానికి మూసీ నది తీరాన్ని టూరిజం హబ్‌గా చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. చంచల్‌గూడ, వనస్థలిపురంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను శనివారం ఉదయం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూసీ నది అభివృద్ధిలో భాగంగా నిర్దేశించిన పనుల్లో భాగంగా ఇండ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత మూసీ బాధితులకు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు.

సుమారు 90 ఇండ్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరానికి సాంస్కృతికంగా పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బాధిత కుటుంబాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి కింద లబ్ది చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేదలు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని అడుగుతున్నారని, వారికి కూడా న్యాయం చేస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 3,500 మందికి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జంట జలాశయాలకు గోదావరి నీరు సరఫరా కోసం రూ.2005 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తద్వారా మూసీ నదిలో మురుగు నీరు లేకుండా స్వచ్ఛంగా ఉంటుందని, టూరిజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

చంచల్‌గూడ ఎక్స్‌రోడ్‌లో 284 ఇండ్లు నిర్మించారని, అందులో 142 మందికి పంపిణీ చేయగా.. 142 ఇండ్లు ఖాళీగా ఉన్నట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. మంత్రి వెంట రాష్ట్ర మున్సిపల్, పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రామిరెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకటచారి, ప్రతిమాసింగ్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, హౌసింగ్ సిఇ అనిల్‌రాజ్, ఎస్‌ఇ, కార్పొరేటర్ షహీద్, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు, హయత్‌నగర్ డిసి తిప్పర్తి యాదయ్య ఉన్నారు.

పెబ్బేరు ఎటిఎంలో చోరీ

- రూ.17.92 లక్షల అపహరణ

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ఎస్‌బిఐ ఎటిఎం సెంటర్లో దొంగలు పడ్డారు. వనపర్తి జిల్లా పెబ్బేరు పురపాలక కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎంను దుండగులు గ్యాస్ కట్టర్లతో కోసి నగదు దోచుకెళ్లారు. సుమారు రూ.17లక్షల 92వేల 500 చోరీ జరిగింది. ఎటిఎం నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రంలో గురువారం నిర్వాహకులు రూ.14 లక్షలు లోడింగ్ చేశారు. అప్పటికే అందులో రూ.9 లక్షల 19 వేలున్నాయి. మొత్తం రూ.23 లక్షల 19 వేల 700 ఉండగా, వినియోగదారులు కొంత డ్రా చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎటిఎంలోకి చొరబడి గ్యాస్ కట్టర్‌తో బాక్సును కోసి.. అందులో ఉన్న రూ.17 లక్షల 92 వేల 500 ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం జనం ఎటిఎం దగ్గరికి వచ్చి డబ్బులు లేకపోవడంతో వెనుదిరిగి పోయారు. నిర్వాహకులు అక్కడికొచ్చి పరిశీలించి చోరీ జరిగినట్టు గుర్తించారు. ఈ విషయంపై ఎటిఎం సీనియర్ ఎగ్జిక్యూటివ్ నరసింహగౌడ్ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు తనిఖీ చేశారు. చోరీకి గురైన ఎటిఎం సెంటర్‌ను ఎఎస్‌పి రాందాస్ తేజావత్, వనపర్తి డిఎస్‌పి వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ, ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి పరిశీలించారు. నరసింహగౌడ్ ఫిర్యాదు కొరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

చాక్లెట్ మాటున గంజాయి సరఫరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చాక్లెట్స్ రూపంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని ఆదిభట్ల పోలీసులు, మహేశ్వరం ఎస్‌ఒటి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలనూ సిపి సుధీర్‌బాబు వెల్లడించారు. బీహార్‌కు చెందిన సంతోష్ కుమార్ అలియాస్ సంతోష్ ప్రసాద్ హైదరాబాద్‌లో హెచ్‌ఎఫ్‌సిఎల్ కంపెనీ కేబుల్ వైర్ ఇన్‌స్టాలేషన్‌లో పని చేసేవాడు. అందులో పనిచేసే కూలీలకు గంజాయిని అలవాటు చేశాడు. బీహార్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరకు చాక్లెట్స్ రూపంలో అమ్మేవాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అతనితోపాటు బీహార్‌కు చెందిన బీరేందర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.8 కేజీల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సిపి వెల్లడించారు.

సాగర్ జలాల కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగర్ జలాలను తక్షణమే విడుదల చేసి, పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో రైతులు కదం తొక్కారు. సిపిఎం కార్యాలయం నుంచి భారీ ప్రదర్శనగా బయలుదేరి ఎన్‌ఎస్‌పి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి.రామిరెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలతో సాగర్ కెనాల్‌కు గండ్లు పడి 22 రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడంలో మంత్రులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. భారీ వర్షాలు, వరదలతో పంటలు కొట్టుకుపోయి, ఇసుక మేట వేసి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పుడు ఉన్న కొద్దిపాటి పంటలకు సాగు నీరందక భూమి నెర్రెలుబాసి నిలువునా పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.30 నుంచి 50 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతన్నలకు భారీ వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేశాయన్నారు. రిజర్వాయర్ల నిండా నీళ్లు ఉన్నా ప్రభుత్వ అసమర్థత కారణంగా పంటలు ఎండిపోతున్నాయన్నారు. వరదలు వచ్చి 22 రోజులు కావస్తున్నా నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం పట్ల ప్రభుత్వం జాప్యం చేయడం సరైనది కాదన్నారు. ఇప్పటికే చాలామందికి రైతు

ఎన్‌ఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

రుణమాఫీ రాక, రైతు భరోసా అందక అవస్థలు పడుతున్న నేపథ్యంలో వరదలతో పంటలు దెబ్బతినడం.. మిగిలిన పంటలకు నీళ్లు అందక ఎండిపోవడం రైతన్నలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం నెల రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు ఎకరానికి 25 వేల రూపాయలు, ఇసుక మేట వేసి కోతకు గురైన పంటలకు 50 వేల రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌పి ఎఇకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎఇ మాట్లాడుతూ.. శనివారం నుంచి సాగర్ జలాల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు, సిపిఎం నాయకులు ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, మందడపు మురళీకృష్ణ, శీలం అప్పారావు, ఎడ్ల తిరుపతిరావు, సిరికొండ నాగేశ్వరరావు, ఎలమద్ది లెనిన్ పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- పిసిసి సమీక్షా సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను అందిస్తూ...అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు.బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని చేస్తున్నాయనీ, దాన్ని తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు ఆయన పిలుపుచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పని తీరుపై ఆయన సమీక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశ నిర్దేశం చేశారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : మల్లు రవి

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలనే అంశంపై టిపిసిసి అధ్యక్షులు పార్టీ నాయకులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని ఎంపి మల్లు రవి చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించాలని సూచించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అందిస్తున్నట్టు తెలిపారు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

బస్ భవన్‌లో కండక్టర్, డ్రైవర్‌ను సన్మానించిన ఆర్‌టిసి ఎండి సజ్జనార్

ప్రయాణికుడికి గుండెపోటు

- సిపిఆర్ చేసి ప్రాణం కాపాడిన మహిళా కండక్టర్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సులో గుండెపోటు వచ్చిన ఓ ప్రయాణికుడికి మహిళా కండక్టర్ సిపిఆర్ చేసి ప్రాణం కాపాడారు. దాంతో ఆర్‌టిసి ఎండి సజ్జనార్.. కండక్టర్, డ్రైవర్‌ను హైదరాబాద్ బస్ భవన్‌కు పిలిపించి సన్మానించారు. వివరాల్లోకెళ్తే.. శనివారం జీడిమెట్ల ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు బయలుదేరింది. బస్సులో ఉన్న 67 ఏండ్ల ప్రయాణికుడు మురళికృష్ణ గుండె నొప్పి వస్తోందంటూ కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ అంజలి వెంటనే డ్రైవర్ సైదులును అప్రమత్తం చేసి బస్సును ఆపించారు. మరో ప్రయాణికుడి సాయంతో అంజలి బస్సులోనే మురళికృష్ణకు సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి అతను స్పృహలోకి వచ్చాడు. ప్రయాణికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది మురళికృష్ణను అంబులెన్స్‌లో సూరారంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి సీతక్క

సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, తన పరిధిలో లేని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మహిళా శక్తి క్యాంటిన్, వికాసం పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం సార్మెడీలు, పటేళ్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సార్మెడిలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాము అస్తిత్వం కోల్పోతున్నామని, ఆదివాసీ మహిళలను ఇతరులు పెండ్లిలు చేసుకొని భూ బదలాయింపులు చేసుకుంటున్నారని తెలిపారు. పోడు భూముల సమస్యలు, నిరుద్యోగం పెరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారని మంత్రి వివరించారు. రాయిసెంటర్‌ల బలోపేతం కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమగ్ర నివేదిక రూపొందించి ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీనిచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు ఇస్తామని వివరించారు. తమ పరిధిలో లేని సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు.

ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరూ ప్రేమించుకున్నారు.. జీవితంలో స్థిరపడ్డాక పెండ్లి చేసుకుందామని భావించారు. పెండ్లి చేసుకునేందుకు కుటుంబీకులను సంప్రదించగా, వారు నిరాకరించారు. దీంతో కలత చెందిన యువకుడు ఉరేసుకోగా.. విషయం తెలిసి యువతి కూడా ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబరిపేట్ గ్రామంలో శనివారం జరిగింది సీఐ సంపత్, ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబరిపేట గ్రామానికి చెందిన రంగోలి వీణా (22), కోనాపూర్ గ్రామానికి చెందిన మొగిలి సాయికుమార్(24)కు చదువుకునే సమయంలో ఏర్పడిన స్నేహం చివరకు ప్రేమగా మారింది. అయితే, జీవితంలో స్థిరపడ్డాక తమ ప్రేమ విషయాన్ని రెండు కుటుంబాల్లో చెప్పి ఒప్పించి పెండ్లి చేసుకోవాలనుకున్నారు. సాయికుమార్ ప్రస్తుతం తూప్రాన్‌లో ప్రయివేటు పాఠశాలలో పీటీగా పని చేస్తున్నాడు. వినాయక చవితి పండుగ కోసం గ్రామానికి వచ్చాడు. తమ ప్రేమ విషయం ఇరువురి తల్లిదండ్రులకు కొన్ని రోజుల కిందటే చెప్పడంతో వారు అందుకు ఒప్పుకోలేదు. దాంతో మనస్తాపానికి గురైన సాయి శుక్రవారం రాత్రి తమ వ్యవసాయం భూమి వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వీణా ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇరు గ్రామాల్లో ఘటనా స్థలాలను సిఐ సంపత్, ఎస్‌ఐ ఆంజనేయులు పరిశీలించి విచారణ చేపట్టారు.మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు...

మా ప్రాధాన్యతలు..మీ ప్రాధాన్యతలు ఒక్కటే

- రాష్ట్ర ప్రభుత్వానికి కితాబిచ్చిన ప్రపంచబ్యాంకు బృందం
- ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అభివృద్ధి విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కే, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్యం, సాగు నీటి రంగాలు తమ ప్రభుత్వ ప్రాధాన్యతలుగా ఉన్నాయని సిఎం వారికి వివరించారు. ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను ఆయన విశదీకరించారు. తాము ప్రాధాన్యతగా తీసుకున్న ప్రాజెక్టులకు ఆర్థిక సహకారాన్ని అందించటంతోపాటు అత్యుత్తమ ప్రమాణాలతో అవి నిలిచే విధంగా సహకరించాలని కోరారు. విద్యా, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి దార్శనికత బాగుందనీ, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టిన్ రైజర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏయే రంగాలను ప్రాధాన్యతా అంశాలుగా ఎంచుకుందో, అవే తెలంగాణ ప్రభుత్వానికి కూడా ప్రాధాన్యతాంశాలుగా ఉన్నాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకష్ణారావు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జోంగ్తూ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సఫారీ కిడ్ ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఒవైసి

బంజారాహిల్స్‌లో సఫారీ కిడ్ రెండో ప్రీస్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ : చిన్నపిల్లల విద్యారంగంలో అంతర్జాతీయ బ్రాండ్ అయిన సఫారీ కిడ్ ప్రీస్కూల్ అండ్ డేకేర్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతంలో తన రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనిని శనివారం ఎంపి అసదుద్దీన్ ఒవైసి లాంఛనంగా ప్రారంభించారు. 2005లో సిలికాన్ వ్యాలీలో స్థాపించిన సఫారీ కిడ్ అమెరికా, కెనడా, భారత్‌లతో 50కి పైగా కేంద్రాలను కలిగి ఉంది. నగరంలో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించడం ద్వారా ఇక్కడ తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకున్నట్లయ్యిందని సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ పేర్కొన్నారు.

రుజువు చేయకుంటే రాజీనామాకు సిద్ధమా?

- సిఎంపై ఆరోపణలు అబద్ధం
- కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కెటిఆర్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలనీ, రుజువు చేయకుంటే రాజీనామాకు సిద్ధమా అని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కెటిఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. "2023 సెప్టెంబర్ 20న రూ.3,616 కోట్ల చొప్పున మూడు ప్యాకేజీలుగా గత ప్రభుత్వం పిలిచింది. ఎన్నికల కోడ్ ఉన్నా అనుమతి తీసుకొని పిఎల్ఆర్, మేఘా, గజా కంపెనీలకు ఇతర కంపెనీలతో కలిపి 3.99 ఎక్సెస్‌తో పనులు అప్పగించారు. టెండర్లలో అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారించిన నేపథ్యంలో తమ ప్రభుత్వం తిరి టెండర్లను పిలిచింది. గత సర్కార్ కంటే తక్కువ(2.44)ఎక్సెస్‌తో జేఎన్ఆర్, కోయా, ఎఎమ్ఆర్ కంపెనీలు ఇతర కంపెనీలతో కలిపి టెండర్లు దక్కించుకున్నాయి" అని పొంగులేటి వివరించారు. ఎక్కడా అవినీతి అక్రమాలు జరగలేదని స్పష్టం చేశారు. కెటిఆర్ ఆరోపించిన సృజన్ రెడ్డికి 2015లో పాలమూరు, రంగారెడ్డి ప్యాకేజీ నెంబర్ ఏడులో రూ.1,100 కోట్ల కాంట్రాక్టు బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పగించిందని గుర్తు చేశారు. కెటిఆర్ ఆరోపించినట్టుగా సాదా కంపెనీకి 20 శాతం వాటా ఉందని స్పష్టం చేశారు. ఇందులో దాయల్సిందేమి లేదని తేల్చి చెప్పారు. సృజన్‌రెడ్డి సిఎంకు సొంత భావమరిది కాదనీ, దూరపు బంధువు మాత్రమేనని గుర్తు చేశారు. ఖమ్మంలో తనపై పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి ఉపేందర్‌రెడ్డి అల్లుడే సృజన్‌రెడ్డి అని చెప్పారు. ఆయనకు తమతో కంటే కెటిఆర్, కెసిఆర్‌తోనే వ్యాపార పరంగా, రాజకీయ పరంగా దగ్గరి సంబంధం ఉందని పేర్కొన్నారు. టెండర్లు వేయొద్దని తాము ఏ కంపెనీని బెదిరించలేదని అన్నారు. ప్రభుత్వం పిలిచిన రీ టెండర్లలో గతంకంటే రూ.54 కోట్లు తక్కువకే బిడ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి చెప్పారు. కోడంగల్ టెండర్లపై కూడా తగిన సమయంలో ఆధారాలతో స్పందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కెటిఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం, పునరుద్ధరణ పనులను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) సిఎండి ముషారఫ్ ఫారూఖీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లారు. అక్కడి సిబ్బందికి భరోసా కల్పించారు. స్థానికులతో మాట్లాడారు. కరెంటు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడిన చెట్ల కొమ్మలను యుద్ధప్రాతిపదికన తీయించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బంజారాహిల్స్, బైరామల్ గూడ, మణికొండ, బండ్లగూడ, కిస్మత్‌పూర్, శంకర్‌మఠ్, తార్నాక, లంగర్‌హౌజ్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలపై చెట్లు కూలడంతో పోల్స్ విరిగిపోయాయి. హోర్డింగులు కూలి వైర్లపై పడ్డాయి. ఇన్సులేటర్ ఫెయిల్ అయ్యి 19 ఫీడర్లు బ్రేక్‌డౌన్ అయ్యాయి. దీనితో విద్యుత్ సిబ్బందిని అప్రమత్త చేస్తూ, స్వయంగా సిఎండి రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన జరిపారు. కేవలం రెండు గంటల వ్యవధిలో విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తెచ్చారు. తమ శాఖ 24 గంటలు అప్రమత్తంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.